ప్రజాశక్తి
మంగళవారం 18 జులై 2023 5 అనంతపురం






స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్ తదితరులు

సంబరంగా స్నాతకోత్సవం

◆ ఎస్‌కెయులో పండుగ వాతావరణం ◆ ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ అబ్దుల్ నజీర్
◆ పరిశోధన, విస్తరణలో ఎస్కేయు భేష్ ◆ కితాబునిచ్చిన గవర్నర్



స్నాతకోత్సవానికి హాజరైన విద్యార్థులు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం(ఎస్కేయు) 21వ స్నాతకోత్సవం సోమవారం నాడు సంబరంగా జరిగింది. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఛాన్సలర్ హోదాలో ఈ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 57 మంది విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేయగా 9150 మందికి డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఎస్కేయు వైస్ ఛాన్సలర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సమస్యలపైనే నాకుండా దివ్యాంగుల క్రికెట్ అభివృద్ధిలో విశేషంగా కృషి చేసిన బెంగళూరుకు చెందిన సమర్ధనం ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ జికె.మహంతేష్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. స్నాతకోత్సవంలో విద్యార్థులను ఉద్దేశించి గరవ్నర్ ప్రసంగించారు. విద్యార్థులకు దిశా నిర్దేశం చేయడంతోపాటు శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం గురించి తన ప్రసంగంలో పేర్కొనడం గమనార్హం. విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధిని ఈ సందర్భంగా గవర్నర్ కొనియాడారు. రూసా నిధులను సద్వినియోగం చేసుకుని మౌలిక సదుపాయల కల్పన చేయడం బాగుందన్నారు. పరిశోధన, విస్తరణ పనులు బాగా జరుగుతున్నట్టు తెలిపారు. అదే సందర్భంలో స్టార్టప్ కింద చేపట్టిన అటల్ ఇంక్యు బేషన్ కేంద్రం రాబోయే రోజు ల్లో ఒక మోడల్ కేంద్రం గానూ మారబో తోందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇస్రో తోడ్పాటుతో జరుగుతున్న కార్యక్రమాలు బాగున్నాయన్నారు. బొటానికల్ గార్డెన్, మయూకవి ప్లాంటేషన్ బాగున్నట్టు కితాబునిచ్చారు. అదే సందర్భంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో విద్య అంత్యంత శక్తివంతమైన ఆయుధమని చెప్పారు. ఇది మనిషికి శక్తినే కాకుండా ఆలోచనలకు ఆకృతినిస్తుందని పేర్కొన్నారు. డిగ్రి పూర్తి చేయడమంటే అభ్యాసన ప్రయాణాన్ని పూర్తి చేయడం కాదని, జ్ఞానం కోసం జీవితకాల అన్వేషణకు నాంది అని విద్యార్థులకు ఉద్బోదించారు. గొప్ప గొప్ప కలలు కనడం, వాటి సాకారానికి కష్టపడి కృషి చేయాలని సూచించారు. ఈ మార్గంలో కొన్ని వైఫల్యాలు ఎదురైనా అధైర్య పడ కుండా ముందుకు వెళ్లా లని తెలిపారు. వైఫల్యాలే విజయానికి సోపానాలని పేర్కొన్నారు. ఏపీ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, ఎస్కేయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, సెంట్రల్ యూనివర్సిటీ విసి ఘోరీ, కలెక్టర్ యం.గౌతమి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ హరిత, జిల్లా పరిషత్ సీఈవో భాస్కర్ రెడ్డి, ఎస్‌కెయు రిజిస్ట్రార్ లక్ష్మయ్య, డీన్స్ నాగభూషణం రాజు, జివి.రమణ, శివ కుమారితో పాటు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, పట్టభద్రులు పాల్గొన్నారు.

39 మందికి బంగారు పతకాలు

ఎస్కేయూ పరిధిలో 2022 సంవత్సరంలో డిగ్రీలో పూర్తి చేసుకున్న 9,150 మందికి పట్టాలను అందజేశారు. పీజీ, ఎంఫిల్, పిహెచ్‌డి పూర్తి చేసిన 1,143 మందికి పట్టాలను అందజేశారు. పీజీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 57 మంది విద్యార్థులకు పథకాలు అందజేయగా, అందులో 39 బంగారు పతకాలు, 12 మెమోరియల్ ప్రైజ్ లు, ఇద్దరికి నగదు పురస్కారాలు, నాలుగు యూనివర్సిటీ ప్రైజ్‌లు అందజేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

శ్రీ కష్ణదేవరాయల యూనివర్సిటీలో వివిధ అభివద్ధి పనులను గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రారంభించారు. ముందుగా యూనివర్సిటీ ప్రాంగణంలో శ్రీకష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం అకడమిక్ బ్లాక్‌ను ప్రారంభించారు. తదనంతరం యూనివర్సిటీలో నూతనంగా నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. ఆ తరువాత మెన్స్ బాలుర హాస్టల్‌ను ప్రారంభించారు.



కెస్‌కెయులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న గవర్నర్

మహంతేష్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మహంతేష్

క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఇండియా అధ్యక్షుడు, స్పిరిట్ స్పోర్ట్స్ ఇండియా అవార్డు, దివ్యజ్ఞాన ఎంపవర్మెంట్ అవార్డు గ్రహీత, సమర్ధనం సంస్థ వ్యవస్థాపకుడు మహంతేష్.జికెకు వర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను రాష్ట్ర గవర్నర్ అందజేశారు. ఈ సందర్భంగా మహంతేష్ సేవలను గవర్నర్ కొనియాడారు.

మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చింది : మహంతేష్,

ఎస్‌కెయు ఇచ్చిన డాక్టరేట్ తనకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చినట్టు అయ్యిందని డాక్టరేట్ స్వీకరించిన డాక్టర్ మహంతేష్ తెలిపారు. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం హర్షనీయమన్నారు. దివ్యాంగుల క్రికెట్ అభివృద్ధి తమ సంస్థ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. విద్య అన్నది వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా ఇతరులను అభివృద్ధి పథంలో నడిపించే సాధనమని చెప్పారు. తన అభివృద్ధి, తోడ్పాటులో అనేక మంది సహకారం ఉందని తెలిపారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని చెప్పారు.

గవర్నర్‌కు ఘనంగా వీడ్కోలు



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్

చిలమత్తూరు : ఎస్‌కెయు స్నాతకోత్సవం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన గవర్నర్ కార్యక్రమాలను ముగించుకుని తిరుగుప్రయాణం అయ్యారు. అనంతపురం నుంచి రోడ్డు మార్గం ద్వారా సోమవారం సాయంత్రం శ్రీ సత్యసాయి జిల్లా కోడికొండ చెక్ పోస్ట్ సమీపంలోని రక్ష అకాడమీ వద్దకు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. కలెక్టర్ పి.అరుణ్ బాబు, సంయుక్త కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ మాధవరెడ్డి, పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్ తదితరులు గవర్నర్‌ను కలిసి వీడ్కోలు పలికారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించి, రోడ్డు మార్గం ద్వారా బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

విజయనగర్ లా కళాశాలలో గవర్నర్..

అనంతపురంలోని హౌసింగ్‌బోర్డులో ఉన్న శ్రీ విజయనగర్ కాలేజ్ ఆఫ్ లా పీజీ స్టడీస్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్ పర్యటించారు. కళాశాలలో లైబ్రరీ, మూట్ కోర్ట్ ఆదనపు భవన నిర్మాణాలకు గవర్నర్ శంకుస్థాపన చేశారు. అనంతరం విద్యార్థులతో గవర్నర్ కాసేపు ముచ్చటించారు. ఆడిటోరియం ఎదుట న్యాయమూర్తిగా జస్టిస్ అబ్దుల్ నజీర్ వెలువరించిన తీర్పుల వివరాలున్న ఫ్లెక్సీ బోర్డును తిలకించారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీ విజయనగర్ కాలేజ్ ఆఫ్ లా ఫౌండర్ ఛైర్మన్ రామిరెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి, అడ్వకేట్ హరికృష్ణ, ప్రిన్సిపల్ డా॥రాఘవేంద్ర చారి పాల్గొన్నారు.



విజయనగర లా కళాశాలలో మాట్లాడుతున్న గవర్నర్



జెఎన్‌టియు సిబ్బందితో మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి

ఉత్పత్తి, తయారీ రంగానికి భవిష్యత్తు

ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రాబోయే కాలంలో ఉత్పత్తులు, తయారీ రంగంకు భవిష్యత్తు ఉందని, ఇవి అభివద్ధి సాధిస్తాయని కె.హేమచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక జెఎన్‌టియు వర్శిటీ అధ్యాపకులు, యూనివర్సిటీ డైరెక్టర్లతో విసి రంగజనార్ధన అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హేమచంద్రా రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ నుంచే వారికి కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. రాబోవు కాలంలో ఉత్పత్తి ఆధారతి పరిశ్రమలు దేశంలో మరింత అభివద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు. అధ్యాపకులు కూడా భోధనా పద్ధతుల్లో సరికొత్త విధానాలను అవలంభించుకోవాలన్నారు. యూనివర్సిటీల భోధన సిబ్బంది వారి ఆర్జిత సెలవులను నగదుగా మార్చుకోవడం, గత సర్వీస్‌ను ఉద్యోగోన్నతిలో పరిగణించడం కోసం జీవో నెం.20ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, యూనివర్శిటి డైరెక్టర్లు, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్‌వి.సత్యనారాయణ, భోధన సిబ్బంది పాల్గొన్నారు.

రెగ్యులర్ తహాశీల్దార్, ఎంపిడిఒను నియమించాలి

సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ



ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

ఉరవకొండకు రెగ్యులర్ తహాశీల్దార్‌తోపాటు ఎంపిడిఒను నియమించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, మండల కార్యదర్శి మధుసూదన్ డిమాండ్ చేశారు. ఈమేరకు సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని తహాశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ నాలుగేళ్ల నుంచి ఉరవకొండకు రెగ్యులర్, తహాశీల్దార్, ఎంపిడిఒలు లేకపోవడం బాధాకరన్నారు. ఇన్‌ఛార్జి అధికారులతో కాలయాపన చేయడం వల్ల మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నియోజకవర్గ కేంద్రానికే రెగ్యులర్ అధికారులను నియమించకపోవడం ఏంటని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే, ముగ్గురు ప్రజాప్రతినిధులున్నా ప్రయోజనం లేదన్నారు. ప్రజల సమస్యలు పట్టించుకోకుండా ప్రజాప్రతినిధులు ఒకరి మీద ఒకరు రాజకీయ విమర్శలు చేసుకుంటున్నారు తప్ప సమస్యలు పరిష్కరించుకున్న పాపానపోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రెగ్యులర్ తహాశీల్దార్, ఎంపిడిఒను నియమించి ప్రజల అవసరాలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి సీనప్ప, మురళీ, వీరాంజనేయులు, సిద్ధప్ప, కౌలు రైతులు, తదితరులు పాల్గొన్నారు.


'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

అనంతపరం కార్పొరేషన్ : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. సోమవారం నగరంలోని 43 డివిజన్ ఉన్న 62 సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తున్నారన్నారు. గతంలో ఈ సర్టిఫికెట్లు కావాలంటే ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడే పరిస్థితి ఉండేదన్నారు. ఈనేపథ్యంలో సిఎం జగన్ ప్రజలకు మేలు చేయాలన్న సంకల్పంతో ప్రజల ఇంటి వద్దకే వాలంటీర్లను పంపి సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్లు ఇషాక్, కమల్‌భూషణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు కిషోర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయాలి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

ఇంటర్మీడియట్ విద్యార్థులకు తక్షణమే పాఠ్యపుస్తకాలను అందజేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో స్థానిక తహాశీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వరుణ్ మాట్లాడుతూ కళాశాలలు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికీ పాఠ్య పుస్తకాలు సరఫరా చేయకపోవడం అన్యాయమన్నారు. సాక్షాత్తు విద్యాశాఖ మంత్రి ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ఇవ్వమని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే నూతన విద్యావిధానం అమలు చేయడం వల్ల అనేకమంది విద్యార్థులను విద్యకు దూరం అయ్యారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందించాలని, లేనిపక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమం చేపట్టి ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అరవింద్, కళ్యాణ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



శింగనమలలో ఎంఇఒకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు



తాడిపత్రిలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

శింగనమల : ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంఇఒ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శులు సూర్య ప్రకాష్, తరిమెల గిరి మాట్లాడుతూ ఇంటర్ తరగతులను ప్రారంభించి రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకూ పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ధనుష్, వర్ధన్, బాబాఫక్రుద్దీన్, నిరంజన్, సందీప్, రాజేష్, సురేష్, కృష్ణ, వంశీ, మురళి పాల్గొన్నారు.

బకాయి వేతనాలివ్వకపోతే ఆగస్టు 1 నుంచి సమ్మె

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జెడ్పీ ఛైర్‌పర్సన్‌కు 'శ్రీరామిరెడ్డి' యూనియన్ నేతల వినతి



జెడ్పీ ఛైర్‌పర్సన్‌కు వినతిపత్రం సమర్పిసునన్న 'శ్రీరామిరెడ్డి' యూనియన్ నాయకులు

శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులకు బకాయి ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని, పిఎఫ్ చెల్లించాలని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకపోతే ఆగస్టు 1వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను సోమవారం కలిసి సమ్మె నోటీసు, సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు 3 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. 2022 ఆగస్టు నుంచి 2023 జూలై వరకూ 11 నెలల ఫ్రంట్ లైన్‌కు, అక్టోబర్ 2022 నుంచి జూలై 6 వరకూ 9 నెలల పిఎఫ్ ఇవ్వాలన్నారు. ఎఫ్-4 రాయదుర్గం, కళ్యాణదుర్గానికి బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఎస్ఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు కాంట్రాక్టర్ శివారెడ్డిని జీతాలు వేయమని అడుగుతుంటే తనకే ఏప్రిల్ నెల నుంచి కాంట్రాక్ట్ అగ్రిమెంట్ కాలేదని, అందుకే జీతాలు వేయలేమని చెబుతున్నారని తెలిపారు. కావున ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని బకాయి వేతనాలు చెల్లించేలా చూడాలని, పిఎఫ్ చెల్లించాలన్నారు. లేనిపక్షంలో ఆగస్టు 1వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఇందుకు స్పందించిన జడ్పీ ఛైర్‌పర్సన్ ఆయా సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి వాటర్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, సెక్రటరీ రాముడు, ట్రెజరర్ వన్నూరుస్వామి, ఆర్గనైజర్ ఎం.నాగరాజు సంయుక్త కార్యదర్శి ప్రభాకర్, ఎస్.రామాంజనేయులు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు విద్యుత్ మీటర్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి



ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు, ప్రజలు

రాజీవ్‌కాలనీ పంచాయతీ పరిధిలో నివసిస్తున్న పేద కుటుంబాలకు విద్యుత్ మీటర్లు ఇవ్వాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో గుత్తి రోడ్డులోని డీ6 పవర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని నెలలుగా ప్రభుత్వ స్థలాల్లో పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. వారికి కనీస సౌకర్యం విద్యుత్ సరఫరా కూడా లేదన్నారు. దొంగ కరెంటును వాడడం ఇష్టం లేదని ఇంటికి కరెంటు మీటర్లు ఇస్తే కరెంటు బిల్లులు చెల్లిస్తామని పేదలు విన్నవించుకుంటున్నా అధికారుల్లో చలనం లేనందన్నారు. అధికారులు స్పందించకపోవడంతో ధర్నా చేయాల్సి వచ్చిందన్నారు. అయితే లైన్‌మెన్ తదితర ఉద్యోగులు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ, రాత్రి సమయాల్లో డిపీలు ఆఫ్ చేసి విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారని తెలిపారు. అక్కడ నివసిస్తున్న ప్రజలు విష సర్పాలు, తేళ్లు, పందులతో ఇబ్బందులు పడుతున్నారని, రాత్రి సమయాల్లో నివాసం ఉండడం కష్టంగా ఉందన్నారు. కావున అధికారులు పేదల పట్ల దయ ఉంచి విద్యుత్ మీటర్లు ఇవ్వాలని కోరారు. అనంతరం విద్యుత్ శాఖ ఏడితో ఫోన్‌లో సమస్యలు తెలుపగా కాలనీలో నివాసం ఉన్నా వారి చిరునామాలను సేకరించి మీటర్లు ఇస్తామని, విద్యుత్ సరఫరాను కొనసాగిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు ప్రకాష్, మసూదు, వలీ, బాబు లక్ష్మీనారాయణ, వరలక్ష్మి, ఇస్మాయిల్, కార్పెంటర్ సీన, ఫాతిమా, మాబున్నీ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సకాలంలో ఆసుపత్రికి తరలింపు - తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తన భూమిని ఇతరులకు ఇవ్వడంతో మనస్థాపం చెందిన కుందుర్పి మండల కేంద్రానికి చెందిన హరీష్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్‌సెల్‌కు ఫిర్యాదు చేయానికి హరీష్ కలెక్టరేట్‌కు వచ్చాడు. అయితే అధికారులను కలవకుండా ముందస్తుగానే బయటనే నిద్రమాత్రలు మింగి కలెక్టరేట్ లోపలికి వచ్చాడు. గేటులోకి రాగానే మత్తు రావడంతో తూలిపడిపోయాడు. ఏమైందని తోటి అర్జీదారులు అడుగుతుండగానే కలెక్టరేట్ వింగ్ పోలీసులు అక్కడికి చేరుకుని 108 వాహనం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు నిద్ర మాత్రలు మింగినట్లు తేల్చారు. అయితే ప్రాణాలకు ప్రమాదం ఏమీ లేదని వైద్యులు తెలిపారు. అతనితో వచ్చిన వారి సమాచారం మేరకు కుందుర్పిలో 2010 హరీష్ ప్రభుత్వం నుంచి అసైన్డ్‌భూమి పొందినట్లు తెలిపారు. అదే భూమిని కొందరు వికలాంగులకు రెవెన్యూ అధికారులు ఇచ్చారని, అది జీర్ణించుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. పరిశీలించిన అధికారులు సదరు హరీష్ నకిలీపత్రాలు సృష్టించి భూమి పొందినట్లు గుర్తించి 2016లో ఆ ప్రభుత్వ భూమిని తహాశీల్దార్, ఆర్‌డిఓలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న భూమిని వికలాంగులకు ఇచ్చినట్లు తెలిపారు. మరి అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలన చేసి వాస్తవాలు తెలపాల్సి ఉంది.

అభివృద్ధికి నోచని రాయదుర్గం

విప్ కాపు.. రోజూ తిరిగే రోడ్డు తాము నిర్మించిందే..

సెల్ఫీ ఛాలెంజ్‌లో మాజీమంత్రి కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

విప్ కాపు రామచంద్రారెడ్డి అసమర్ధత, చేతకానితనం వల్ల రాయదుర్గంలో అభివృద్ధి కుంటుపడిందని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. సెల్ఫీ ఛాలెంజిలో భాగంగా టిడిపి ప్రభుత్వ హయాంలో నిర్మించిన బాదనహల్ వంతెన వద్ద సోమవారం సెల్ఫీ వీడియో తీసుకుని విడుదల చేశారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా రాయదుర్గం-బళ్లారి ప్రధాన రహదారి అత్యంత అధ్వాన్నంగా ఉండేదన్నారు. బాదనహల్ వంతెన కోసం అనేక సంవత్సరాలుగా ప్రతిపాదనలు చేస్తున్నారే తప్ప చేసింది లేదన్నారు. అయితే తెలుగుదేశం ప్రభుత్వంలో చంద్రబాబు ఆశీస్సులతో తాము రూ 8.60 కొట్లు వెచ్చించి వంతెనను పూర్తి చేసినట్లు తెలిపారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన 'కాపు' ఇలాంటి శాశ్వత పనులు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. తన స్థిర నివాసమైన బళ్లారి నుంచి నిత్యం రాయదుర్గానికి రాకపోకలు సాగిస్తున్న "కాపు"నకు ఇలాంటి వంతెనలు నిర్మించాలనే ఆలోచన ఎందుకు రాలేదని నిలదీశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యేకు చేతనైతే కణేకల్లు వంతెనను నిర్మించాలని డిమాండ్ చేశారు.



సెల్ఫీ ఛాలెంజ్ ఫోటో తీసుకుంటున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ఇకెవైసి చేయించుకోవాలి

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్, ఫ్యామిలీ పెన్షన్ పొందుతున్న పెన్షన్‌దారులందరూ తప్పనిసరిగా తమ పెన్షన్ ఇకెవైసిని పూర్తి చేయించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.పెద్దన్నగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరం ఎస్‌టిఒ పరిధిలో ఉన్న 10,600 మంది పెన్షనర్లకు 1200 మంది సర్వీస్ పెన్షనర్స్, ఫ్యామిలీ ఇప్పటికీ ఇంకా తమ పెన్షన్ సిఎఫ్ఎంఎస్‌కు ఆధార్‌తో లింక్ ఇకెవైసి చేయించుకోలేదన్నారు. వీరిలో ఎక్కువ మంది ఫ్యామిలీ పెన్షనర్స్ ఉన్నారన్నారు. వారికి ఫోన్ చేసి ఇకెవైసి చేయించుకొవాలని చెప్పుతుంటే వీరిలో ఎక్కువ మంది తమ సేవింగ్స్ ఖాతా ఉన్న బ్యాంకుల్లో ఇకెవైసి అయిపోయింది అంటున్నారని తెలిపారు. కానీ బ్యాంకు ఇకెవైసి వేరు, పెన్షన్‌కు సంబంధించి ట్రెజరీలో చేయించే ఇకెవైసి వేరు అని స్పష్టం చేశారు. ఇతర సందేహాలకు ఎస్‌టిఒ సెల్..63045 35837, సిబ్బంది 94918 63589, 9951 10167, 80746 81645 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

తలనీలాల వేలంపాట

నార్పల : మండల పరిధిలోని గూగూడు కుళ్లాయిస్వామి ఆలయ ఆవరణలో సోమవారం తలనీలాల వేలంపాట నిర్వహించారు. ఈవేలంలో ఉలిగప్ప రూ.27లక్షలకు దక్కించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారిణి శోభ తెలిపారు.

'భవిష్యత్తుకు గ్యారెంటీ'పై ప్రచారం

ఆత్మకూరు : మాజీమంత్రి పరిటాల సునీత ఆదేశాల మేరకు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలపై టిడిపి నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని తలుపూరు గ్రామంలో టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు, తలపూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లారెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి అశ్వర్థరెడ్డి, కొండన్న, నారాయణస్వామి, ఎర్రిస్వామి, విశ్వరెడ్డి, ఎస్సీ సెల్ శీనా, భాస్కర్, ఏకాంబరం, అమర్నాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన విప్ కాపు

రాయదుర్గం : జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్‌ను విప్ కాపు రామచంద్రారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అబ్దుల్‌నజీర్ గవర్నర్‌తోపాటు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు కూడా కావడంతో విప్‌తోపాటు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు కాపు భారతి కలిసి చర్చించారు.



గవర్నర్‌ను సన్మానిస్తున్న విప్ కాపు దంపతులు

ఎస్‌కెయు స్నాతకోత్సవంలో పతకాల పంట

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని భువనవిజయ ఆడిటోరియం ప్రాగణంలో సోమవారం నిర్వహించిన 21వ స్నాతకోత్సవం విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య కోలాహలంగా సాగింది. విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు అతిథులతో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థుల ప్రతిభకు గుర్తింపుగా డిగ్రీ పట్టాలు, గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు, కుటుంబ సభ్యుల ఆనందం ప్రస్ఫుటంగా సభికులకు కనిపించింది. గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్ ఎస్‌కెఉయ ప్రాగణంలోకి ప్రవేశించగానే పోలీస్ గార్డుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి నేరుగా వర్శిటీలో నూతనంగా నిర్మించిన ఇంజినీరింగ్ కళాశాల అకడమిక్ బ్లాక్‌ను ప్రారంభించారు. తర్వాత నూతనంగా ఏర్పాటు చేసిన 60 అడుగుల రోడ్డు, బాలుర హాస్టల్‌ను కలెక్టర్ గౌతమి, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి కలిసి ప్రారంభించారు. అనంతరం స్నాతకోత్సవం వేడుకల్లో పాల్గొన్నారు.

ఆటో కార్మికుడి కుమారుడుకి గోల్డ్ మెడల్



సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణానికి చెందిన ఆటో కార్మికుడు అంజినప్ప కుమారుడు కె.వంశీకృష్ణ పాలిమర్ సైన్స్‌లో వర్శిటీ స్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించారు. అంతేగాకుండా కళాశాలలో నిర్వహించిన ప్రాగణం నియామకాల్లో బెర్జర్ పెయింట్స్‌లో ఉద్యోగం కూడా సాధించాడు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ తన నాన్న ఆటో నడిపి తనను చదిచించాడన్నారు. ఇప్పటికే ఉద్యోగం సాధించానని, రానున్న రోజుల్లో కుటుంబానికి తోడుగా ఉంటానని తెలిపారు.

పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో రాణిస్తా : చాందిని



పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో రాణిస్తానని బంగారు పతకం సాధించిన కాకర్ల చాందిని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం నిర్వహించిన స్నాతకోత్సవ వేడుకల్లో అనంతపురానికి చెందిన చాందిని గవర్నర్ నుంచి బంగారు పతకం అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో బాగా చదివి పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో ఉద్యోగం సాధించి ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు.

వ్యవసాయ కూలీ కుమారుడికి గోల్డ్ మెడల్



తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా చెందిన ఎండి.మాలిక్ బాషా లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో డిగ్రీ పట్టా పొందడమేగాకుండా గోల్డ్‌మెడల్ సాధించాడు. తల్లిదండ్రులు ఇద్దరూ వ్యవసాయ కూలి పనులు చేసుకుంటారు. కూలి పని చేసుకుంటూనే మాలిక్‌బాషాను ప్రభుత్వ కళాశాలలో చదివించారు. తల్లిదండ్రుల కష్టంతో చదివిన తాను ఇటీవల తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పరీక్ష రాయగా లైబ్రరీ సైన్స్‌లో ఉద్యోగం సాధించినట్లు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు పట్టణ అధ్యక్షులు రామాంజనేయులు

ప్రజాశక్తి-తాడిపత్రి

మున్సిపాలిటీలోని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మున్సిపల్ కార్మికుల సమస్యలతోపాటు జూలైలో జరిగే రాష్ట్ర కార్యాచరణపై స్థానిక కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రవికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి దశలవారీగా ఆందోళనలు చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 20న మహిళా కార్మికుల రిలే దీక్ష, 21న ఇంజినీరింగ్, పారిశుధ్య, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కార్మికుల రిలే దీక్ష, 27న మున్సిపల్ కార్యాలయం ముట్టడి, వచ్చేనెల 7న చలో కలెక్టరేట్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అయినా కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే 15వ తేదీ తర్వాత రాష్ట్రవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు రామాంజనేయులు, ఇంజినీరింగ్ విభాగం సిఐటియు అధ్యక్షులు ఉపాధ్యక్షులు, కార్యదర్శి జుబేర్, ఓబయ్య, జిపి ప్రసాద్, హరికృష్ణ, మహబూబ్‌బాషా, పారిశుధ్య విభాగం నాయకులు శంకర్, సాయికృష్ణ, నారాయణ, రాముడు, ఇంజనీరింగ్, పారిశుధ్య, పర్మినెంట్ కార్మికులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి

కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కౌలు రైతుసంఘం, సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలోని యూనియన్ బ్యాంకు మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిసిఆర్‌సి కార్డులు ఉన్న కౌలు రైతులందరికీ బ్యాంకు రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. ఎకరాకు రూ.30 నుంచి రూ.40 వేల వరకూ ముందస్తు గుత్త చెల్లించి వ్యవసాయ పొలాల్లో పనులు చేసినా సకాలంలో వర్షాలు లేక కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కనీసం బ్యాంకుల ద్వారానైనా కౌలు రైతులకు రుణాలు మంజూరు చేస్తే వారి కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో ప్రభుత్వ, బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో కౌలురైతులు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా స్పందించి కౌలురైతులకు రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలురైతు సంఘం మండల నాయకులు సీనప్ప, వీరాంజనేయులు, సిద్ధప్ప, మురళి, నాగరాజు, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కౌలు రైతుసంఘం నాయకులు

యువతను మోసం చేసిన సిఎం జగన్

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఎన్నికల ముందు యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తామని నమ్మించి మోసం చేసిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మిషన్ రాయలసీమ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లలో దారుణంగా మోసపోయిన నిరుద్యోగ యువతీ, యువకులు సిఎం జగన్‌పై తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. నిరంకుశ పాలనతో రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులు రావడం లేదన్నారు. తద్వారా యువత ఉపాధి అవకాశాలు కోల్పోతోందన్నారు. జాబు రావాలంటే మళ్లీ బాబు రావాలనే నినాదంతో యువతను జాగృతం చేయనున్నట్లు తెలిపారు. టిడిపి ప్రభుత్వంలో ప్రయివేట్, ప్రభుత్వ రంగాల్లో 6.50 లక్షల పైచిలుకు ఉద్యోగాలను కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని గుర్తుచేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు రావాలన్నా, రాష్టం బాగుపడాలన్నా ఒక్క టిడిపితోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని అధికారంలోకి తీసుకురావడంలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, శివ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు రమేష్, కనేకల్లు మండల తెలుగు యువత అధ్యక్షుడు నవీన్, నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి సత్తి, సర్పంచి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.




మిషన్ రాయలసీమ పోస్టర్‌ను విడుదల చేస్తున్న కాలవ శ్రీనివాసులు

లస్సీ పాయింట్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక నడిమి వంక సమీపంలోని బళ్లారి రోడ్డులో ఉన్న సన్‌రైజ్ ఆసుపత్రి పక్కన నూతనంగా నిర్మించిన లస్సీ పాయింట్ ఫ్రాంచైజీని మేయర్ వసీం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో ప్రజలకు లస్సీతోపాటు ఇతర శీతలపానీయాలను అందించాలని లస్సీ పాయింట్ అధినేత సయ్యద్‌హుస్సేన్‌కు సూచించారు. సంస్థ అధినేత సయ్యద్‌హుస్సేన్ మాట్లాడుతూ దేశం మొత్తంగా లస్సీ సంస్థకు సంబంధించిన 700 బ్రాంచిలు ఉన్నాయని, తాము అనంతపురంలో మూడు పాయింట్లు నడుపుతున్నట్లు వివరించారు. తెలుగు రాష్ట్రాల్లో మరో నాలుగు బ్రాంచ్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాణ్యత ప్రమాణాలతో ద్రవ రసాలను అందిస్తున్న తమకు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. ప్రజల సౌకర్యార్థం దాదాపుగా 100 వెరైటీ పనుల రసాలను లస్సీ, ఇతర జ్యూస్‌లను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఇసాక్ మౌలానా మహబూబా, మౌలానా అబ్బో సాలె, సోయల్ షఫీ సోయా అత్తారి అష్రఫీ, డైరీ డే ఆర్ఎస్ఎం మురళి, డిస్ట్రిబ్యూటర్లు సునీల్, రాబర్ట్, తదితరులు పాల్గొన్నారు.



లస్సీపాయింట్‌ను ప్రారంభిస్తున్న మేయర్ వసీం, అధినేత సయ్యద్‌హుస్సేన్

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం

సాయి ఆదిత్య కన్‌స్ట్రక్షన్ అధినేత పురుషోత్తమ మురళీకృష్ణ పుట్టినరోజు సందర్భంగా నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలామురళి మాట్లాడుతూ తన జీవిత భాగస్వామి అయిన పురుషోత్తమ మురళీకృష్ణకు హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తను చేస్తున్న సేవా కార్యక్రమాల్లో బాధ్యతగా వెనుక ఉంచి తనను నడిపిస్తూ, ప్రోత్సహిస్తున్నందుకు జీవితమంతా రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కవీన్ ఆదిత్య, నబిరసూల్, సుబ్రమణ్యం, సుబ్బారావు, ఓబుళపతి, కిష్టప్ప, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థి సంఘాల నేతల అరెస్టు సిగ్గుచేటు

అనంతపురం : గవర్నర్ పర్యటన సందర్భంగా విశ్వవిద్యాలయాల్లో ఉన్న సమస్యలపై విద్యార్థి సంఘాలు గళం విప్పకుండా పోలీసులు ఆదివారం అర్ధరాత్రి ముందస్తు అరెస్టులకు పాల్పడటం బాధాకరమని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం రాత్రి నిద్రపోతున్న విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేసి రాప్తాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారన్నారు. ఉదయం అక్కడ నుంచి నగరంలోని పోలీస్‌స్టేషన్‌కి తరలించారన్నారు. ఇది సరైన పద్ధతి కాదని, విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని అడగనున్న తమని అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సూర్యచంద్రయాదవ్, పరమేష్, ఎస్కెయు వైఎస్ఆర్ విద్యార్థి నాయకుడు పి.హేమంత్‌కుమార్, ఎంఎస్‌యుఐ అధికార ప్రతినిధి పులి రాజు, ఎఐఎస్ఎ అధ్యక్షులు వేమన, రాజునాయక్, ఎఐఎస్ఎఫ్ నాయకులు ఉమామహేశ్వర్, తదితరులు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఆలూరు సాంబశివారెడ్డికి సన్మానం




సాంబశివారెడ్డికి బొకే అందజేస్తున్న నాయకులు

శింగనమల : విదేశీ పర్యటన ముగించుకుని అనంతపురంలోని ఇంటికి చేరుకున్న ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డిని పలువురు నియోజకవర్గ వైసిపి నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. సాంబశివారెడ్డిని కలిసిన వారిలో వైసిపి నాయకులు రవికుమార్‌నాయక్, ఎన్‌వి.నారాయణ, చెన్నకేశవులు, తదితరులు ఉన్నారు.

వేరుశనగ పంట పరిశీలన

అనంతపురం : ఇటుకలపల్లిలో రైతులు సాగు చేసిన వేరుశనగ పంట పొలాలను అనంతపురం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రవి సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా రైతు ఈశ్వరరెడ్డి సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించి పచ్చపురుగు, ఆకుముడుత, వేరుపురుగు ఉన్నట్లు గుర్తించి నివారణ చర్యలను వివరించారు. అనంతరం ఆర్‌బికెను సందర్శించి పిఎం కిసాన్ ఇకెవైసి, మట్టి నమూనాల సేకరణ, కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు, వేరుశనగ, కంది విత్తనాల పంపిణీ, రసాయనిక ఎరువుల నిల్వలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి జె.శశికళ, వ్యవసాయ విస్తరణ అధికారి మురళీకృష్ణ, ఆర్‌బికె అసిస్టెంట్ హేమలత, రైతులు పాల్గొన్నారు.



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఎడిఎ రవి

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య



మృతిచెందిన నాగరాజు

గార్లదిన్నె : మండల కేంద్రానికి చెందిన చాకల నాగరాజు (57) సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాగరాజు 13 సంవత్సరాల నుంచి టీబీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో సోమవారం తీవ్ర అనారోగ్యం పాలవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మృతుడి భార్య లక్ష్మీదేవి, కుమారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎఎస్ఐ శంకర్‌రెడ్డి తెలిపారు.

ఇద్దరికి పాముకాటు

గుత్తి : మండలంలోని వేర్వేరు గ్రామాల్లో సోమవారం ఇద్దరు మహిళలు పాముకాటుకు గురయ్యారు. కొత్తపేట గ్రామానికి చెందిన భారతి గ్రామ శివారులోని పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అలాగే ఎంగిలి బండ గ్రామానికి చెందిన షేకున్‌బీ తన ఇంటిలో నిల్వ ఉంచిన పత్తిని తొలగిస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే చికిత్స నిమిత్తం ఆమెను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

గుత్తి : మండలంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని ఎంగిలిబండ గ్రామ మలుపు వద్ద 67వ జాతీయ రహదారిపై కృప అనే యువకుడు ట్రాక్టర్ ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అదనపు చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. స్థానిక పట్టణంలోని అనంతపురం రోడ్డులో 44వ జాతీయ రహదారిపై సోమవారం బైకు బోల్తా పడిన సంఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎస్.పల్లికి చెందిన హరి అనే వ్యక్తి పని నిమిత్తం పెద్దవడుగూరుకు వెళ్లాడు. తిరిగి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి బయలుదేరాడు. పట్టణంలోని అనంతపురం రోడ్డులో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ హరి ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదాలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

రాయదుర్గం : పట్టణంలోని సిద్దేశ్వర కాలనీలో ఉన్న బయలు ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి హుండీలోని డబ్బు చోరీకి గురైంది. గుర్తు తెలియని దుండగులు హుండీ తాళం పగలగొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. హుండీలో సుమారు రూ.20వేల వరకూ ఉండవచ్చని స్థానికులు తెలిపారు.

పెద్దొడ్డి విఆర్‌ఎ మృతి

గుత్తి : మండలంలోని పెద్దొడ్డి గ్రామ రెవెన్యూ సహాయకుడు (విఆర్ఎ) పక్కీరప్ప (65) సోమవారం మృతిచెందాడు. ఈయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో ఆరోగ్య పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, సిఎస్‌డిటి సూర్యనారాయణ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. తర్వాత అంత్యక్రియలకు రూ.15 వేలు ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విఆర్ఎల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత అత్యంత కీలకం

ది ట్రెల్లిస్ స్కూల్ ఛైర్మన్ శ్రీకాంత్ వడ్ల



విద్యార్థులతో మాట్లాడుతున్న

అనంతపురం : నేటి ఆధునిక సమాజంలో ఆర్థిక అక్షరాస్యత చాలా కీలకమని ది ట్రెల్లిస్ పాఠశాల ఛైర్మన్ శ్రీకాంత్ వడ్ల అన్నారు. సోమవారం నగరంలోని జీసెస్‌నగర్‌లో ఉన్న ట్రెల్లిస్ పాఠశాలలో ఫిల్స్ (ఫైనాన్షియల్ లిట్రసీ లెర్నింగ్ సెషన్)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందులో భాగంగానే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించేందుకు అంకితమైన విద్యావేత్తగా, విద్యార్థులు నిజ జీవిత ఉదాహరణ నుంచి నేర్చుకునే అద్భుతమైన అవకాశాన్ని కల్పించేందుకు పాఠశాలకు చెప్పులు కుట్టే వ్యక్తిని ఈ కార్యక్రమానికి స్వాగతిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. అనంతరం చెప్పులు కుట్టే కార్మికులు కుళ్లాయప్ప, రామదాసు పాదరక్షల మరమ్మతులకు ధరలు, రోజువారి ఆదాయం, ఖర్చుల నియంత్రణ వంటి వివిధ అంశాలపై వివరించారు. డబ్బును ఎలా సంపాదిస్తారు.. ఆర్థిక బాధ్యత, ప్రాముఖ్యతపై తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అనిల్ తేజ, కోశాధికారి నందిని, ప్రధానోపాధ్యాయురాలు భార్గవి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపు పనులు అడ్డగింత

బొమ్మనహాల్ : మండలంలోని లింగదహాల్ గ్రామంలో ఇసుక తరలించేందుకు హిటాచీతో దారి పనులు చేస్తుండగా విషయం తెలుసుకున్న రైతులు సోమవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వేదావతి నదిని నమ్ముకునే వ్యవసాయం చేసుకుని జీవిస్తున్న తమకు ఇసుక తవ్వకం ద్వారా నీటి సమస్య ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే చాలా ఎకరాలను బీళ్లుగా పెట్టుకున్నామని వాపోయారు. వేదావతి నది నుంచి ఇసుక తరలిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 మంది రైతులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపిపిగా రామిరెడ్డి

పెద్దపప్పూరు : బొందలాదిన్నె రామిరెడ్డి (రామయ్య)ని ఇన్‌ఛార్జి ఎంపిపిగా నియమిస్తూ జిల్లా పరిషత్ సిఇఒ నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు ఎంపిడిఒ రామకృష్ణ సోమావారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం వైస్ ఎంపిపిగా విధులు నిర్వహిస్తున్న రామిరెడ్డిని ఇన్‌ఛార్జి ఎంపిపిగా నియమించనున్నట్లు తెలిపారు.

ఐ టిడిపి మండల కన్వీనర్‌కు పరామర్శ

పుట్లూరు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని కుమ్మనమల గ్రామానికి చెందిన ఐటిడిపి మండల కన్వీనర్ పెద్దిరాజును నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం

ఉరవకొండ : ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజల కోసం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఉరగాద్రి చౌడేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో ఆలయ ఛైర్మన్ శ్రీనివాసులు, కొత్త శరత్ ఆధ్వర్యంలో అనంతపురం సవేరా ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త శ్రీనివాసులు వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చంద్రమ్మ, జెడ్పిటిసి పార్వతమ్మ, సర్పంచి లలిత, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, ఎంఎల్‌ఒ ఓబులేసు, నాయకులు బసవరాజు, ఓబన్న, సవేరా వైద్యులు రామ్మోహన్‌బాబు, ఈఎన్‌టి వైద్యులు అర్జున్, ఫార్మా సిబ్బంది కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలకు గ్యారెంటీ నిబంధనను తొలగించాలి

రాయదుర్గం : పంట రుణాల మంజూరు విషయంలో పూచీకత్తు నిబంధనను తొలగించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాయదుర్గం తాలూకా అధ్యక్షుడు ఎస్వి ఆంజనేయులు కోరారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యారెంటర్ నిబంధన ఉంచడం వల్ల రైతులందరికీ రుణాలు పొందేందుకు వీలుపడడన్నారు. పూచీకత్తు స్థానంలో బ్యాంకు ఖాతాదారుని సంతకం తీసుకుంటే సరిపోతుందన్నారు. అంతేకాక బ్యాంకు కార్యాలయానికి వెళ్లే దారి ఇరుకుగా ఉండటం వల్ల వృద్ధులు, వికలాంగులు మొదటి అంతస్తులో ఉన్న బ్యాంకు కార్యాలయానికి చేరేందుకు కష్టం అవుతోందన్నారు. రైతులు, వృద్ధులు, వికలాంగుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని రుణాల విషయంలో నిబంధనలు సరళం చేయాలని, బ్యాంకును విశాలమైన ప్రాంగణంలో మార్చేలా చూడాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు నాగరాజు, సంతోష్, జనార్ధన, తిప్పేస్వామి తదితరులు ఉన్నారు.

రైతు దగా ప్రభుత్వం

గుంతకల్లు : రైతులను తీవ్ర సంక్షోభంలోకి నెట్టి మోసం చేస్తున్న రైతు దగా ప్రభుత్వం వైసిపి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్ విమర్శించారు. సోమవారం స్థానిక బిటి పక్కీరప్ప భవనంలో రైతుసంఘం నియోజవర్గ కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 16 రకాల నిర్ణయాలు అమలు చేస్తున్నానని కళ్యాణదుర్గం సభలో సిఎం జగన్ అబద్దాలు చెప్పడం బాధాకరమన్నారు. ముఖ్యంగా రైతుభరోసా, బీమా ప్రతి ఏడాది ఇస్తున్నానని గొప్పలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే ఆర్‌బికెల్లో ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు ఇస్తున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఒకవేళ ఎక్కడైనా ఇచ్చినా నాణ్యతలేని వేరుశనగ విత్తనాలు ఇస్తున్నారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభాకర్, టిడిపి నాయకులు మల్లికార్జున, రైతుసంఘం నాయకులు మందాలప్ప, సిపిఐ నియోజవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి బి.మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మండల కార్యదర్శి రామురాయల్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పిసి కుళ్లాయప్ప, రైతుసంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

అమర్నాథ్‌గౌడ్ హత్య బాధాకరం

అనంతపురం : రేపల్లెలో నెల క్రితం పదవ తరగతి విద్యార్థి అమర్నాథ్‌గౌడ్‌ను హత్య చేయడం బాధాకరమని టిడిపి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నగరంలోని టిడిపి కార్యాలయంలో అమర్నాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ వైసిపి పాలనలో దాడులు, హత్యలు, అరాచకాలు మితిమీరిపోయాయన్నారు. అమర్నాథ్‌గౌడ్‌ను హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు, బీసీ సెల్ నగర అధ్యక్షులు సిమెంట్ పోలన్న, రాష్ట్ర కార్యదర్శి శివబాల, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ, శాలివాహన సాధికారిక రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య, వడ్డెర సాధికారిక రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్, ఈడిగ సాధికారిక రాష్ట్ర డైరెక్టర్లు గోపాల్‌గౌడ్, వాల్మీకి సాధికారిక రాష్ట్ర డైరెక్టర్ మణిరవి, కురుబ సాధికారిక రాష్ట్ర డైరెక్టర్ నారాయణస్వామి, వాల్మీకి సాధికారిక జిల్లా అధ్యక్షులు ప్రతాప్‌నాయుడు, వడ్డెర సాధికారత జిల్లా అధ్యక్షులు వన్నూరు, టిడిపి బీసీ సెల్ జిల్లా నాయకులు గంగవరం బుజ్జి, కొయ్యగూరు పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగనపల్లిలో 'జగనన్న సురక్ష'

నార్పల : మండలంలోని గంగనపల్లి సచివాలయం పరిధిలో నేటి నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహ తెలిపారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ, సచివాలయ సిబ్బంది జయలక్ష్మి, దివ్యభారతి, సురేఖ, వాలంటీర్లు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై సిపిఎం ఫిర్యాదు



తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

కనగానపల్లి : మండలంలో భూ ఆక్రమణలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం సిపిఎం మండల కార్యదర్శి బత్తల కదిరప్ప ఆధ్వర్యంలో రైతులు తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కదిరప్ప మాట్లాడుతూ మండల పరిధిలోని దాదులూరు పంచాయతీ పరిధిలో ఉన్న కొండ ప్రాంతం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే చిన్న, సన్నకారు రైతులు, నిరుపేదల భూములకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. దాదులూరు రెవెన్యూ గ్రామంలో వంక పరంబోకు భూమిని స్వాధీనం చేసుకుని లే అవుట్స్ వేశారని, తద్వారా హంద్రీనీవా పిల్లకాలువ పక్క గ్రామాలకు వెళ్లకుండా చేయడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అంతేగాకుండా అటవీ ప్రాంతం, వన సంపద అన్యాక్రాంతం కాకుండా వెంటనే చర్యలు చేపట్టాలని, లేనిచో భవిష్యత్తులో రైతులు, ప్రజలతో కలిసి సిపిఎం పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు.

జెవివిలో భాగస్వాములు కండి

ఓబులదేవరచెరువు : శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం ప్రజలందరూ సైన్స్ ఫలాలు పొందాలని వక్తలు సూచించారు. జన విజ్ఞాన వేదికలో భాగస్వాములు కావాలని జెవివి జిల్లా కార్యదర్శి గౌస్ లాజం పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమ వారం జెవివి మండల శాఖ ఆధ్వర్యంలో కొండకమర్ల గ్రామంలో గోడపత్రిక పోస్టర్లను విడుదల చేశారు. అనంత రం వారు మాట్లాడుతూ శాస్త్రీయ విధానం ద్వారా రేపటి తరాన్ని చైతన్యం చేయడానికి చెకుముకి పరీక్షలు, ఆరో గ్యం, మూఢ్యాచారాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జెవివి 35 ఏళ్లుగా తెలుగు ప్రజల తో స్నేహ సంబంధాలు కొనసాగిస్తుందన్నారు. ప్రజలు శాస్త్రీయంగా ఆలోచించాలని మానవత్వంతో జీవించాలని ఆకాంక్షిస్తూ చైతన్యవంతం చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం మునేనాయక్, షబీన, జెవివి సభ్యులు సోమశేఖర్, అతావుల్లా, మాధవి. భార్గవరెడ్డి, నేలకోటప్ప, ద్వారకనాథ్‌రెడ్డి, రోషన్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

బత్తలపల్లి : ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ సౌజన్యకుమారి సూచించారు. మండల పరిధిలోని దంపెట్ల గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పనులపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ కూలీలు వంద రోజుల పని దినాలను పూర్తి చేసుకోవాలన్నారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పని చేస్తేనే కచ్చితమైన కూలీ దక్కుతుందన్నారు. పని ప్రాంతాల్లో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపి గజ్జల వెంగళరెడ్డి, సర్పంచులు చల్లా కరుణాకర్‌నాయుడు, పద్మావతి, ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీధర్‌రెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాలి

బత్తలపల్లి : వాలంటీర్ల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన జనసేనపార్టీ అధినేత పవన్ కళ్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని దంపెట్ల గ్రామ సచివాలయ ఆవరణలో దంపెట్ల, గరికలపల్లి గ్రామ పంచాయతీల సర్పంచులు చల్లా కరుణాకర్‌నాయుడు, పద్మావతి అధ్యక్షతన 'జగనన్న సురక్ష' గ్రామసభ నిర్వహించగా ముఖ్యఅతిథులుగా ఎంపిపి బగ్గిరి త్రివేణి, వైస్ ఎంపిపి గజ్జెల వెంగళరెడ్డి, ఎంపీడీఓ సౌజన్యకుమారి, సిఎస్‌డిటి శారద హాజరయ్యారు. అనంతరం 1,111 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దివాకర్, మండల కన్వీనర్ కుగ్గిరి బయపరెడ్డి, సచివాలయ కన్వీనర్ జయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

రొద్దం : మండల పరిధిలోని గౌరాజుపల్లి, రొద్దంలో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న పంటలను సోమవారం ఎఒ నివేదిత, ఎఇఒ అంజాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన పద్ధతులను వివరించారు. వారి వెంట విహెచ్ఎలు గోవర్ధన్, నాగభూషణ్, గోవిందప్ప, రైతులు మాధవయ్య, లోకేష్, తదితరులు ఉన్నారు.

విజన్ బిల్డింగ్‌పై శిక్షణ

ముదిగుబ్బ : స్థానిక క్రాంతి మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఎపిఎం హేమలత ఆధ్వర్యంలో ఆదర్శ మండల సమాఖ్య లక్షణాలు– మార్పులు అంశాలపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సిబ్బంది పాత్ర ఎలా ఉండాలో ఆట పాటలు ఛార్టు ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సమాఖ్య లీడర్లు పద్మావతి, లక్ష్మీనారాయణమ్మ, ఈసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

దళితుల భూసమస్యలపై ఫిర్యాదు

రొళ్ల : మండల పరిధిలోని టిడి.పల్లి గ్రామపొలిమేరలో ఉన్న దళితుల భూ సమస్యలపై సోమవారం ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు టైగర్ వన్నూర్‌స్వామి, కళ్యాణదుర్గం తాలూకా అధ్యక్షులు లక్ష్మణ మూర్తి నేతృత్వంలో మడకశిర తాలూకా అధ్యక్షులు యాల్లోటి రామంజి, రొళ్ల మండల అధ్యక్షులు నరసింహమూర్తి రొళ్ల డిప్యూటీ తహశీల్దార్ భాగ్యాలక్ష్మిని కలిసి వివరించారు. స్పందించిన డిప్యూటీ తహశీల్దార్ తమ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మడకశిర మండల అధ్యక్షులు చందు, దాసు, దుర్గేష్, రాజ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం బస్సు ఏర్పాటు

రొద్దం : మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలలు, కళాశాలలకు రొద్దంకు రావాల్సి ఉంది. అయితే కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో కొందరు విద్యార్థులు హిందూపురం, మడకశిర, తదితర పట్టణాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో చేరారు. దీంతో స్థానిక కళాశాలలో విద్యార్థుల చేరిక బాగా తగ్గిపోయింది. దీంతో ప్రిన్సిపల్ విజయలక్ష్మిబాయి మడకశిర ఆర్టీసీ డిపో అధికారులు, ఎమ్మెల్యే శంకరనా రాయణకు ఈ విషయాన్ని వివరించి రొద్దం మీదుగా పెనుకొండకు బస్సు ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే సూచన మేరకు డిపో మేనేజర్‌కు బస్సు సర్వీసును ఏర్పాటుచేయగా సోమవారం ఎంపీపీ చంద్రశేఖర్, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి ప్రారంభించారు. దీంతో ప్రిన్సిపల్ విజయలక్ష్మిబాయి, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెట్టి మారుతిరెడ్డి, రాజగోపాలరెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, సర్పంచి వనజ, ఎంపిటి సిలు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

18న ఆశా వర్కర్ల ధర్నా

పెనుకొండ : ఆశా వర్కర్ల సమస్యలపై ఈ నెల 18వ తేదీ డిఎంహెచ్ఓ కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్నామని తెలుపుతూ సోమవారం పెనుకొండ సబ్ సెంటర్‌లో వైద్యాధికారి సౌమ్యకి సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ఆశా వర్కర్స్‌కు పని భారం తగ్గించాలని, సంబంధంలేని పనులు చేయించరాదని, అధికారుల వేధింపులు ఆపాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవులు వెంటనే అమలు చేయాలని, తదితర డిమాండ్లతో ధర్నా చేస్తున్నట్లు అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు అలివేలమ్మ, తులసి, రాజేశ్వరి, గంగ, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెండర్లు పిలిచి ఖాళీ స్థలంలో షెడ్లు వేయాలి

పెనుకొండ : పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని 180 సర్వే నంబర్‌లో(ఇందిరమ్మ కాలనీలో) 20 ఏళ్ల క్రితం లేవుట్ వేశారు. ఈ లేవుట్ కు పడమర దిశలో 30 లింకుల రోడ్డు తర్వాత ఉన్న ఖాళీ స్థలంలో షెడ్లు వేసేందుకు వైసిపి నాయకులు ఏర్పాట్లు చేశారని అలా ఏకపక్షంగా వ్యవహరించకుండా ఓపెన్ టెండర్ వేసి నగర పంచాయతీకి ఆదాయం వచ్చేలా చూడాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ వంశీకృష్ణభార్గవను కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ గిరి, టౌన్ కన్వీనర్ రవిశంకర్, నాయకులు హుజూర్, రామలింగ నాయుడు, ఖాదిర్, రియాజ్, జావీద్, అనిల్, తదితరులు ఉన్నారు.

మైసూర్ ఎక్స్‌ప్రెస్‌లో వృద్ధుడు మృతి

ధర్మవరం టౌన్ : మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం రాత్రి ధర్మవరం రైల్వేస్టేషన్‌లో ఆగిన సమయంలో జనరల్ బోగీలో ఓ గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందినట్లు గుర్తించామని రైల్వే జీఆర్పీ ఎస్ఐ గోపికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ధర్మవరం స్టేషన్‌కు రాగానే జనరల్ బోగీలో ఓ వృద్ధుడు అపస్మారకస్థితిలో పడి ఉన్నట్లు ప్రయాణికులు సమాచారం ఇవ్వడంతో పరిశీలించామన్నారు. అతడు అనారోగ్యం, ఇతర కారణాల వల్ల చనిపోయి ఉండవచ్చని రైల్వే పోలీసులు భావించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94406 27640, 94405 52808 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని రైల్వే ఎస్ఐ తెలిపారు.

కండక్టర్ మృతి

కదిరి టౌన్ : కదిరి డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న ఎం.మధుసూదనరావు(58) అనంతపురం నగరంలోని సవేరా హాస్పిటల్‌లో చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. దహనక్రియల ఖర్చుకు గానూ డిపో మేనేజర్ కుటుంబ సభ్యులకు రూ. 15వేలు అందజేశారు. ఆయన స్వస్థలం వైఎస్ఆర్ కడప జిల్లాలోని పులివెందుల. కదిరి డిపోలో 1992లో కండక్టర్‌గా విధుల్లో చేరారు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొన్నేళ్లుగా పట్టణంలోని ఎన్‌జివో కాలనీలో నివాసం ఉంటున్నారు. అనేకసార్లు ఉత్తమ ఆదాయ కండక్టర్‌గా ఎంపికయ్యాడు. మధుసూదనరావు మృతి పట్ల కదిరి డిపో మేనేజర్ బి.మైనుద్దీన్, అసిస్టెంట్ మేనేజర్లు హరిమోహన్, హరిత, ట్రాఫిక్ సూపర్‌వైజర్ నాగసుబ్బయ్య, అసోసియేషన్ నాయకులు బైరిశెట్టి, శంకరప్ప, రామచంద్ర, ఎన్వి రమణ, నారాయణస్వామి, సురేంద్ర, రవీంద్ర తదితరులు సంతాపం తెలిపారు.

గ్రామ సంఘాలకు శిక్షణ

ఓబులదేవరచెరువు : గ్రామ సంఘాలకు మూడు రోజుల శిక్షణలో భాగంగా మొదటి రోజు మండల సమైక్యలో నిర్వహించిన శిక్షణకు మండల పరిధిలోని 40 గ్రామ సంఘాల నుంచి సమైక్య సభ్యులు హాజరయ్యారని ఎపిఎం రమణప్ప తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్లు వెంకటరమణ, వేణుగోపాల్, చంద్రారెడ్డి, శ్రీనివాసులు హేమభూషణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, కార్యదర్శి లక్ష్మీనరసింహ, నాగలక్ష్మి, లక్ష్మి, గ్రామ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు తగదు

గాండ్లపెంట : వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక గ్రామ సచివాల యం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ వాలంటీర్లు ర్యాలీ నిర్వహించి నాలుగు రోడ్ల కూడలిలో మానవ హారంగా ఏర్పడ్డారు. అనంతరం జనసేనపార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌పైన కేసు నమోదు చేయాలని ఎస్సై మల్లి కార్జునరెడ్డికి ఫిర్యాదు చేశారు. అలాగే తహశీల్దార్ హమీద్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జెసిఎస్ రవీంద్రరెడ్డి, వాలంటీర్లు కవిత, ఆజాద్, కొండయ్య, అంజి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

ఇళ్ల స్థలాలు చూపాలని గ్రీవెన్స్‌లో వినతి

కొత్తచెరువు : కొత్త చెరువుకు చెందిన 11 మందికి గతేడాది డిసెంబర్‌లో సర్వే నెంబర్– 392లో ఇంటి పట్టాలు మం జూరు చేశారు కానీ ఇప్పటివరకు స్థలాలు చూపించలేదని మానవ హక్కుల సంఘం నాయకులు పాపన్న, బెల్లం నజీర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో లబ్ధిదారుల తో కలిసి తహశీల్దార్ రామాంజనేయరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 145 మందికి ఇంటి పట్టాలు ఇచ్చారని, వారిలో 11 మందికి ఇంతవరకూ స్థలాలు చూపించలేదన్నారు. జగనన్న కాలనీలో ప్లాట్లు ఖాళీగా ఉన్నాయని వాటిని వీరికి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం నాయకులు నాగరాజు, సాయిప్రసాద్, లబ్ధిదారులు ఆంజనేయులు పాల్గొన్నారు.